
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
సోమవారం 5 ఆగస్టు 2024





మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఫలించిన చర్చలు.. నేతన్నల దీక్షల విరమణ

- సమస్యల పరిష్కారానికి కృషి
- ప్రభుత్వం సానుకూలంగా ఉంది
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

8లో..

స్వచ్ఛదనం పచ్చదనం





- నేటి నుంచి ప్రారంభం
- కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక అధికారులు
- కార్యక్రమానికి ఐదు రోజుల షెడ్యూల్

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ఐదు రోజులపాటు స్వచ్ఛదనం - పచ్చదనం పేరిట పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 5వ తేదీ నుంచి 9వ వరకు జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల మున్సిపాలిటీలు, 255 గ్రామ పంచాయతీల్లో కార్యక్రమాలను నిర్వహించనున్నారు. కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులకు ఇప్పటికే ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు పదవీకాలం ముగిసిపోవడంతో ప్రత్యేక అధికారులు ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమాలను నిర్వహించనున్నారు. జడ్పీ సీఈవో, డీఆర్డీవో, డీపీవో, డీఎల్పీవోతోపాటు మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ప్రత్యేక అధికారులతోపాటు వార్డు స్థాయిలో నియమించిన అధికారులతో కార్యక్రమాలను చేపట్టనున్నారు. జిల్లాలో 255 గ్రామ పంచాయతీల్లో వంద గ్రామ పంచాయతీల్లో వెయ్యి జనాభా వరకు, 5 వేల జనాభా వరకు 148 గ్రామ పంచాయతీలు ఉండగా 5 వేల పైనా 7 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో జరిగే కార్యక్రమాలను ప్రతీ రోజు పంచాయతీ కార్యదర్శితోపాటు ఇద్దరు, ముగ్గురు అధికారులతో కలిసి నిర్వహించిన కార్యక్రమాల నివేదికను ఉన్నత అధికారులకు అందించాలి ఉంటుంది.

మొదటి రోజు

ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమయ్యే స్వచ్ఛదనం, పచ్చదనం మొదటి రోజున స్థానిక నాయకులు, మహిళా సంఘాలు, యూత్, వార్డు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి, ర్యాలీ తీయనున్నారు. మహిళా సంఘాల సమావేశంలో ప్రచార చిత్రాల ద్వారా వీధి కుక్కల బెడద, ఇంటి స్థాయిలో చెత్తను వేరు చేయడంపై చేపట్టాల్సిన కార్యకలాపాలపై చర్చించాలని, అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలల్లో పారిశుధ్యం, తోటల పెంపకం, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకంతో కలిగే దుష్పరిణామాలపై ప్రసంగం, వ్యాస రచన పోటీలు నిర్వహించాలని, వీధులు, బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేయాలని, ఏరియాల వారీగా శుభ్రత, రోజువారీ ప్రాతిపదికన చెత్తహాని కలిగించే పాయింట్లపై దృష్టి పెట్టాలని ఆదేశించింది. ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, హాస్టళ్లు, పీహెచ్‌సీలు, బస్‌స్టాప్‌లు, ప్రభుత్వ స్థలాలు శుభ్రం చేయాలని సూచించింది.

రెండో రోజు

జిల్లాలో తాగునీటి వనరులు శుభ్రం చేయాలని నిర్ణయించింది. క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే ప్రజలకు సరఫరా చేయాలని, క్లోరినేషన్ స్థాయిలు, క్లోరో స్కోప్‌లు కిట్‌ల ద్వారా టెస్ట్ చేయాలని ఆదేశించింది. తాగునీటి సరఫరా సరిగా లేని ప్రాంతాలకు దృష్టి పెట్టాలని సూచించింది. 300 చదరపు గజాల విస్తీర్ణం గల భవనాలను గుర్తించి, యజమానులకు వాటర్ హార్వెస్టింగ్ సిస్టం ద్వారా నీటి నిల్వ పద్ధతులపై అవగాహన కల్పించాలని సూచించింది. సరస్సులు, చెరువులు మొదలైనవి సందర్శించి, వాటిని పునర్ జీవింపచేయడానికి ఏర్పాట్లు చేయాలని తెలిపింది.

మూడో రోజు

మురికి కాలువల్లో పూడిక తీయించాలని, లోతట్టు ప్రాంతాలు, నీటి నిల్వగల ప్రదేశాలను గుర్తించి మొరం నింపడం, నిల్వ నీటిని బయటకు పంపడం, మురికి కాలువల చివర, నీటి పారుదల సౌకర్యం లేని, నీటి నిల్వ ప్రదేశాలలో కమ్యూనిటీ సోప్‌పిట్ లేదా ఇంకుడు గుంతలు నిర్మించాలని ఆదేశించింది. అన్ని ప్రభుత్వ సంస్థలు, పబ్లిక్ స్థలాలు శుభ్రం చేయించాలని తెలిపింది.

నాలుగో రోజు

మహిళా సంఘాలు బాధ్యులు, ఆశాలు, పాఠశాల సమావేశాల్లో డెంగ్యూ, మలేరియాపై అవగాహన కల్పించాలని, మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థలలో అన్ని సర్వేలు నిర్వహించాలని ఆదేశించింది. ఏదైనా ప్రాంతంలో జ్వరాలు బయటపడితే ఇంటెన్సివ్ క్లీనింగ్, యాంటీలార్వాల్, ఫాగింగ్ చర్యలు చేపట్టాలని, దోమలను నిరోధించే ఆయిల్ బాల్స్ నీరు నిల్వ ప్రదేశాల్లో విడుదల చేయాలని తెలిపింది. పంచాయతీ కార్యదర్శులు, పశుసంవర్ధక శాఖ సమన్వయంతో వీధి కుక్కల సర్వే నిర్వహించాలని ఆదేశించింది.

చివరి రోజు

పబ్లిక్ ఇన్‌స్టిట్యూషన్స్, పబ్లిక్ స్థలాలు శుభ్రం చేయాలని, ప్రతీ శుక్రవారం గ్రామపంచాయతీ, పట్టణ స్థానిక సంస్థలలోని అన్ని గృహాలను సందర్శించి ఆవరణలో ఉన్న అన్ని నీటి నిల్వలు తొలగించాలని, అన్ని గృహాల్లో ఉపయోగించని వస్తువులను ఇంటి నుంచి తొలగించాలని ఆదేశించింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో డ్రై డే నిర్వహించాలని, ప్రతీ ఇంటిలో టీ కప్పులు, షూలు, సీసాలు, టైర్లు వస్తువులు, వంటి వాటిని తొలగించి దోమలు వృద్ధి చెందకుండా చూడాలని సూచించింది. ప్రభుత్వ సంస్థలపై కప్పులు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, హాస్టళ్లు, పీహెచ్‌సీలు, బస్టాండ్, ముఖ్యంగా మైదానాలు శుభ్రం చేయాలని ఆదేశించింది. శిథిల భవనాలు, గోడలు తొలగించాలని సూచించింది.

స్థలాలను గుర్తించి, మొక్కలను నాటాలి..

ప్రతీ గ్రామపంచాయతీ, పట్టణ స్థానిక సంస్థలలో స్థలాలను గుర్తించి, మొక్కలను నాటి వన మహోత్సవం నిర్వహించాలని, అటవీ శాఖ సహకారంతో వన్య ప్రాణులు తినే చెట్లు, గిరిజనులు విక్రయించుకునే అటవీ ఉత్పత్తుల చెట్లను పెంచాలని ప్రభుత్వం సూచించింది. అవెన్యూ ప్లాంటేషన్‌కు సంబంధించిన స్థలాలు గుర్తించాలని, పాఠశాలలు, ఇతర ప్రభుత్వ సంస్థల్లో కిచెన్ గార్డెన్, ఇతర పండ్ల చెట్లు పెంచాలని, ప్రతి ఇంటికి కనీసం ఆరు మొక్కలను పంపిణీ చేయాలని, మునగ, కరివేపాకు, వేప, మామిడి, ఉసిరి, జామ, చింత, దానిమ్మ మొదలైన కుటుంబాలకు ఉపయోగ పడే పండ్ల, ఇతర మొక్కలను పంపిణీ చేయాలని ఆదేశించింది. జిల్లాలోని అన్ని వార్డు, గ్రామ పంచాయతీ టీమ్ సభ్యులు రోజూ ఆయా కార్యక్రమాలు పర్యవేక్షిస్తూ వాటిపై కలెక్టర్‌కు నివేదిక అందించాలని పేర్కొంది. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛదనం - పచ్చదనం నిర్వహించాలని ఆదేశించింది. మునిసిపల్ కమిషనర్లు, జడ్పీ సీఈవో, డీఆర్డీవో, డీపీవో, డీఎల్పీవోలు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, నివేదికలు రోజు వారీగా కలెక్టర్‌కు సమర్పించాలని సూచించింది.

స్వచ్ఛదనం పచ్చదనం విజయవంతం చేయాలి

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు విజయవంతం చేయాలి. షెడ్యూల్ ప్రకారం ప్రతీ కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలి. గ్రామాలు, పట్టణాలు స్వచ్ఛత.. పచ్చదనం కృషి చేయాలి.

నేటి నుంచి దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

సిరిసిల్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దివ్యాంగులకు అవసరమయ్యే ఉపకరణాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. సోమవారం నుంచి అర్హులైన వారిని ఎంపిక చేయడానికి గ్రామాల్లోనే శిబిరాలు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఏఎల్ఐఎంసీవో సంస్థ ద్వారా ఎడీఐపీ పథకం ద్వారా దివ్యాంగులకు చేతి కర్రలు, చంక కర్రలు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, మూడుచక్రాల సైకిళ్లు, స్మార్ట్‌కేన్ అంధులకు చేతికర్ర, స్మార్ట్ ఫోన్‌లు, కృత్రిమ అవయవాలు వంటివి అందించనున్నారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో శిబిరంలో దరఖాస్తు చేసుకోవాలి. 5వ తేదీన బోయినపల్లి, 6న ఇల్లంతకుంట రైతు వేదిక, 7న వేములవాడ మండల పరిషత్, 8న చందుర్తి రైతు వేదిక, 9న ఎల్లారెడ్డిపేటలో లక్ష్మీ మల్లారెడ్డి ఫంక్షన్‌హాల్, 10న సిరిసిల్లలో సినారె కళామందిరంలో శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తెలిపారు. ఇతర వివరాల కోసం 9440469338, 9490091770 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 4:ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు రాచర్లబొప్పాపూర్, బండలింగంపల్లి, తిమ్మాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బొంగులకింద తండాలో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులు ఆదివారం పంపిణీ చేశారు. ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన వైద్యం అందిస్తోందన్నారు. రాచర్లబొప్పాపూర్‌లో మొడుసు రాజిరెడ్డికి రూ.60 వేలు, బొంగులకింద తండాలో హర్యానాయక్‌కు రూ.15 వేలు, బండలింగంపల్లిలో సుధాకర్‌రెడ్డికి రూ.24 వేలు మంజూరయ్యాయన్నారు. నాయకులు నర్సయ్య, గౌస్, లింగాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, సాహెబ్, రాంరెడ్డి, రాజయ్య కిష్టారెడ్డి, లక్ష్మణ్, దేవేందర్, శ్రీనివాస్, రమేశ్, దత్తాద్రిగౌడ్, మహేందర్‌రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వీర్నపల్లి, ఆగస్టు 4 : ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని ఎస్సై ఎల్లాగౌడ్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లతో ట్రాఫిక్ నియమాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. వాహనానికి సంబంధించిన సరైన ధ్రువీ కరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. కానిస్టేబుల్ మల్లాగౌడ్, సిబ్బంది ఉన్నారు.

ఏజీపీ శ్రీనివాస్‌కు సన్మానం

కోనరావుపేట, ఆగస్టు 4 : సిరిసిల్ల కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గా నియామకమైన సందర్భంగా నాగారం రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. నాగారం గ్రామం నుండి ఉన్నత స్థానానికి వెళ్లిన శ్రీనివాస్‌ను గ్రామస్తులు, రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. రైతు సంఘం నాయకులు ధూమ్‌పేట నాగరాజు, భాస్కర్ రావు, మల్లయ్య, ప్రకాష్, గంగయ్య, ప్రభాకర్, అంజయ్య మధు, నారాయణ, చంద్రయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

పల్లెప్రకృతి వనం.. పశువులకు ఆవాసం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 4: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్దె చెరువు సమీపంలో ఉన్న పల్లె ప్రకృతి వనంపై అధికారుల పట్టింపు కరవైంది. గతంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి వృక్షాలుగా మారాయి. పల్లెప్రకృతి వనం ప్రధాన గేటుకు తాళం వేయకపోవడంతో పచ్చదనంతో కళకళలాడే పల్లెప్రకృతి వనం పశువులకు ఆవాసంగా మారింది. నిత్యం పశువులు చేరి పూలు, పండ్ల చెట్లను పనికి రాకుండా చేస్తున్నాయి. మరోవైపు పోకిరీలకు అడ్డాగా మారుతోంది. మద్యం, శీతలపానీయాల ఖాళీ సీసాలు, కేక్ కట్ చేసిన కవర్లతో నిండిపోతోంది. పల్లెప్రకృతి వనం ఆవరణలో పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు పనికి రాకుండాపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పల్లెప్రకృతి వనంపై పర్యవేక్షించి పశువులు, పోకిరీల చేరకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



పేషెంట్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, ఆగస్టు 4: ప్రజలందరికీ మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా వేములవాడ ఏరియా ఆసుపత్రిపై ప్రధానంగా దృష్టి సారించామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ సందీప్ ఝాతో కలిసి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆసుపత్రిలోని వార్డులను, ప్రసూతి విభాగం, పాలియేటివ్ కేర్, మేల్ వార్డులను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న రోగులతో మాట్లాడి వైద్యసేవల గురించి అడిగి తెలుసు కున్నారు. అనంతరం వైద్యులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలో కావాల్సిన వసతులు, అవసరమైన సిబ్బంది వివరాల తెలుసుకున్నారు. సీటీ స్కాన్ సేవలను త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ఆసుపత్రిలో గైనకాలజిస్టు, ఈఎన్‌టీ, ఎముకలు, జనరల్ సర్జన్ విభాగాలకు సంబంధించి డాక్టర్లు ఉన్నారని, వారి సేవలను ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. పాలి యేటీవ్ కేర్‌లో చికిత్సపొందుతున్న కోనరావుపేటకు చెందిన ఆడెపు చంద్రమౌళిని, కనగర్తికి చెందిన ఈగ ముకుందంతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, పూర్తి వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఏఎస్పీ శేషాద్రినీ రెడ్డి, డీఎంహెచ్‌వో వసంతరావు, డీసీహెచ్ఎస్ పెంచలయ్య, ఇంచార్జ్ సూపరింటెంట్ సంతోష్ చారి, డాక్టర్లు ప్రవీణ్, శ్రీనివాస్, తహశీల్దార్ మహేష్‌కుమార్, వేములవాడ టౌన్ సీఐ వీర ప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



పురస్కారం అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ధార్మిక, కార్మిక క్షేత్రంగా ఉన్న జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామని అనాడు మాటిచ్చిన ప్రకారమే ప్రజలకు సేవకుడిగా ఉంటూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు పోతున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సిరిసిల్లలోని మాన్య ఫంక్షన్‌హాల్‌లో ప్రముఖ బీసీ నాయకుడు నాగుల మల్లయ్య వర్ధంతి నిర్వహించారు. జాతీయ స్థాయిలో ఏటా అందజేస్తున్న నాగుల మల్లయ్య స్మారక పురస్కారాన్ని ప్రముఖ కవి, దాశరథి పురస్కార గ్రహీత జూకంటి జగన్నాథంకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి ఎక్కడా ఆగదని, వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తామని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో కొంత ఇబ్బందులు రావడం సహజమేనని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో వాటిని అధిగమించి ముందుకు పోతున్నామని అన్నారు. వేములవాడ రాజన్న ఆలయానికి గతంలో ముఖ్యమంత్రి హోదాలో వచ్చిన కేసీఆర్ ఇక్కడే లగ్గం చేసుకున్నానన్నారని అభివృద్ధి చేస్తానన్నారని గుర్తు చేశారు. ఏటా రూ.100 కోట్లు ఇస్తానని చెప్పి మాట తప్పారన్నారు. ఈ బడ్జెట్‌లో వీటీడీఏకు రూ.50 కోట్లు కేటాయించామన్నారు. కొందరు వేములవాడలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి రాజకీయాలు చేయాలని చూశారన్నారు. గత పాలకులు సిరిసిల్ల చేనేత రంగానికి బకాయిలు పెడితే రూ.100 కోట్లు విడుదల చేశామని, సిరిసిల్ల సెస్‌కు బకాయిలు పెట్టారని అన్నారు. త్వరలోనే నేత కార్మికులకు శుభవార్త అందించబోతున్నామన్నారు. సమాజంలో రుగ్మతలు, సాంఘీక దురాచారాలను రూపుమాపడానికి బీసీ నాయకులుగా నాగుల మల్లయ్య ఎంతో కృషి చేశారన్నారు. జూకంటి జగన్నాథం కవిగా, రచయితగా ఎన్నో పురస్కారాలు అందుకున్నారన్నారు. ప్రజా ప్రభుత్వంలో స్వేచ్ఛ వాయువులు పీల్చుకునే తరుణంలోనే దాశరథి అవార్డు స్వీకరించడం గర్వకారణమని చెప్పడం చూస్తే ఎంత అణచివేత జరిగిందో గమనించవచ్చన్నారు. అవార్డుపై జూకంటి జగన్నాథం మాట్లాడుతూ నాగుల మల్లయ్య అవార్డు అందుకోవడం కవిగా, రచయితగా మరింత బాధ్యతను పెంచిందన్నారు. దాశరథి అవార్డు అందుకున్న సమయంలో ప్రజాస్వామ్య స్వేచ్ఛ ప్రాణ వాయువు ఊపిరి అడుతున్న సందర్భంగా అవార్డు వచ్చినట్లు చెప్పానన్నారు. నాగుల మల్లయ్య బీసీ అభ్యర్థిగా ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు అగ్రవర్ణాలు, ఇతర పార్టీలు ఒక్కటై మల్లయ్యను ఓడించాయన్నారు. మల్లయ్యను గెలిపించుకుంటే రాజకీయ ముఖచిత్రం ఈనాడు మారిపోయి ఉండేదన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించాలని, బీసీలు ఐక్యంగా రావాల్సిన అవసరం ఉందని అన్నారు. అనేక అణచివేతలకు గురువుతున్న దానిని అర్థం చేసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, కాంగ్రెస్‌సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డి, అవార్డు కమిటీ చైర్మన్ నాగుల సత్యనారాయణ, కన్వీనర్లు నాగుల సంతోష్, ఎండీ సలీం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, కౌన్సిలర్ పత్తిపాక పద్మ, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు గడ్డం నర్సయ్య, వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్, మడుపు శ్రీదేవి, అడెపు చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది పనితీరు మార్చుకోవాలి



పరిశీలిస్తున్న డీపీవో వీరబుచ్చయ్య

ముస్తాబాద్, అగస్టు 4: గ్రామ పంచాయతీ సిబ్బంది పని తీరు మార్చుకోవాలని, అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అన్నారు. మండల కేంద్రంలో జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య ఆదివారం పలు వీధులను పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పచ్చదనం కార్యక్రమం సోమవారం ప్రారంభిస్తున్న నేపథ్యంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ రానున్నారు. ఈనేప థ్యంలో జిల్లా పంచాయతీ అధికారులు, పట్టణ సిబ్బందితో స మావేశాన్ని నిర్వహించి వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. డంపింగ్ యార్డు, నర్సరీలను వీధుల్లో పారిశుధ్య పరిశీలించారు. ప్రత్యేకాధికారి సురేశ్, పంచాయతీ అధికారి రమేశ్, ఇన్‌చార్జి ఎంపీడీవో పాల్గొన్నారు.

శ్రావణం..శుభప్రదం



- మంగళ గౌరీ, వరలక్ష్మి వ్రతాలు
- వెల్లివిరియనున్న భక్తిపారవశ్యం
- నేటి నుంచి శ్రావణ సందడి
- సామూహిక కంకుమార్చనలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

శ్రావణ మాసం ఎంతో శుభ ప్రదమైంది. శుభకార్యాలు, నోములు, వ్రతాలతో భక్తి భావంతో పరవశించి పోతారు. పెళ్లి పనులతో కొందరు.. దేవాలయాలను సందర్శిస్తూ మరికొందరు హడావుడిగా కనిపిస్తారు. కుటుంబ సుఖ సౌఖ్యాల కోసం మహిళలు నోములు, వ్రతాలు చేస్తారు. శ్రావణ మాసంలో మంగళ గౌరీ, వరలక్ష్మి వ్రతాలతోపాటు నాగపంచమి, రాఖీ పౌర్ణమి పండుగ జరుపుకుంటారు. ముఖ్యంగా పెళ్లి అయిన మొదటి ఐదు సంవత్సరాల్లో మహిళలు మంగళ గౌరీ వ్రతం చేస్తారు. ఆగస్టు 5 నుంచి సెప్టెంబరు 2 అమావాస్యతో ముగుస్తుంది. శ్రావణ మాసంలో మహిళలంతా హుషారుగా కనిపిస్తారు. లక్ష్మి కటాక్షం ఉంటే అన్నింటా అభివృద్ధి, అంతులేని సంపద కలుగుతాయని విశ్వసిస్తారు. మహాలక్ష్మి ప్రాణనాథుడు శ్రీమహావిష్ణువు జన్మ నక్షత్రమైన శ్రావణం పేరుతో శ్రావణ మాసం కొనసాగుతుంది. విష్ణువును శ్రద్ధా భక్తులతో పూజిస్తారు. మహాలక్ష్మి అనుగ్రహం కోసం పూజలు చేస్తారు. శ్రావణంలో అన్ని శుభదినాలే. ముఖ్యంగా సోమ, మంగళ, శుక్ర, శనివారాలు ఎంతో పవిత్రమైనవిగా భావిస్తారు. మంగళ గౌరీ వ్రతం, నాగపంచమి, భాను సప్తమి, పుత్రదా ఏకాదశి, దామో దర ద్వాదశి, వరహా జయంతి, వరలక్ష్మి వ్రతం, జం ధ్యాల పౌర్ణమి, పొలాల అమవాస్య పండుగలు జరుపుకుంటారు.

శివుడికి ప్రీతికరం

శ్రావణమాసంలో ప్రతీ సోమవారం శివుడికి ప్రీతికరమైనదిగా భావిస్తారు. శివ భక్తులు నాలుగు సోమవారాలు దీక్షగా ఉపవాసం ఉండి అభిషేకం, శమకం, పార్వతిదేవికి కుంకుమ పూజలు చేస్తారు. కుమారస్వామిని, నందీశ్వరున్ని పూజిస్తారు. పూజారులు రుద్రం వల్లిస్తారు. శివుడి వద్ద దీపాలన్ని వెలిగించి కుంకుమ, బియ్యం, చందనం, పూలు, యాలకులు, లవంగాలు, వక్కలు, దుర్వార పత్రం, దత్తుర దళాలను సమర్పించుకుంటారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేస్తారు.



కుంకుమార్చనలో మహిళలు (ఫైల్)


కృష్ణాష్టమి వ్రతం

శ్రావణ బహుళ అష్టమి శ్రీకృష్ణ జయంతిని జరుపుకుంటారు. ఈ నెల 26న స్మార్థకృష్ణాష్టమి, 27న వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు జరుపుకోనున్నారు. కృష్ణాష్టమి నాడు ఇళ్లను శుభ్ర పరిచి తోరణాలతో అలంకరించి ఇంటి ముంగిళ్లలో బాలకృష్ణుడి పాద ముద్రలు వేస్తారు. ఉట్టి కొట్టి ఉత్సవాలు నిర్వహిస్తారు.



రాణాకు చేరిన చిట్టీల పంచాయితీ

మల్లాపూర్, ఆగస్టు 4: మండలంలో జోరుగా జరుగుతు న్న జీరో చిట్టిల దందా చిలికిచిలికి గాలి వానగా మారి పోలీసుస్టేషన్‌కు చేరింది. మండలం లోని మొగిలిపేటలో జరుగుతున్న చిట్టీలతో మోసపోయామని నిర్వహకుడు ఆకుల గంగాధర్‌పై బాధితుడు సంగం పెద్దగంగారాం పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఆకుల గంగాధర్ రూ. 5లక్షలు, రూ. 6లక్షలు, ఐదు తులాల బంగారం చిట్టిల వ్యాపారం చేస్తున్నాడు. దీంతో చిట్టీలు కట్టమని సంప్రదించగా రూ. 5, రూ. 6 లక్షల చిట్టీలు కట్టడంతో పాటు కుతూరు ముక్కెర లక్ష్మితో ఐదు తులాల బంగారం చిట్టీలను నాలుగు సంవత్సరాల నుంచి కట్టుకుంటు వస్తున్నామన్నాడు. కట్టిన చిట్టి డబ్బులు ఇవ్వమని ఆకుల గంగాధార్‌ను గతనెల నుంచి అడుగుతు న్నా పట్టించుకోకుండా దాటవేశాడు. దీంతో గ్రామంలోని పెద్దమనిషి వద్దకు పిలిచి అడగా మీరే డబ్బులు నాకు ఇంకా ఇవ్వాల్సి ఉందని బెదరింపులకు పాల్పడ్డాడు. కట్టిన చిట్టిన డబ్బులు ఇవ్వక బెదరింపులకు పాల్పడుతున్న ఆకుల గంగాదర్‌పై చర్యలు తీసుకోని న్యాయం చేయాలని పోలీసుల స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.



కుక్కల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 4: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామ శివారులోని డంపింగ్ యార్డు వద్ద రాగట్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి మందాటి మల్లేశంపై ఆదివారం కుక్కలు దాడి చేశాయి. తీవ్ర గాయాల పాలైన మల్లేశంను మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మల్లేశం రహదారి వెంట వస్తున్న క్రమంలో గుంపులుగా ఉన్న కుక్కలు ఒక్కసారిగా మీద పడి దాడికి దిగాయి. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని స్థానికులు పేర్కొన్నారు. ప్రజలపై దాడి చేస్తున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బారి నుంచి తమను రక్షించాలని కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు- ద్విచక్రవాహనం ఢీ

- ఒకరికి తీవ్రగాయాలు

మంథని ఆగస్టు 4: ఆర్టీసీ బస్సును ద్విచక్రవాహనం ఢీ కొన్న సంఘటన ఆదివారం మంథని మున్సిపాల్ పరిధీలోని గంగపురి వద్ద చోటు చేసుకుంది. మంథని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు(టీఎస్08జెడ్0086) మంథని నుంచి హైదరాబాదుకు వెళ్లే క్రమంలో గంగపురి మూలమలుపు వద్ద ప్రమాదం సంభవించింది. ముత్తారం నుంచి మంథనికి వస్తున్న ద్విచక్రవాహనం వేగంగా ఆర్టీసీ బస్సుకు తగలడంతో ద్విచక్ర వాహనం కింద పడింది. ద్విచక్రవాహ నం వెనుకాల కూర్చున్న వ్యక్తి దండు పోచయ్యకు ప్రమాదంలో కాలు విరిగింది. గాయపడిన వ్యక్తిని మంథని ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచనల మేరకు మెరగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకోని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.



తాగడానికి డబ్బులు లేక మద్యం షాపుల్లో చోరీలు

- నిందితుడిని పట్టుకున్న సుల్తానాబాద్ పోలీసులు


సుల్తానాబాద్, ఆగస్టు 4: మద్యానికి బానిసగా మారిన ఓ వ్యక్తి మద్యం కొనుగోలుకు డబ్బులు లేక తురుచుగా మద్యం దుకాణాల్లోనే దొంగతనాలకు పాల్పడుతున్నాడు. నిందితుడిని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. తాము సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా సిద్దిపేట పోలీస్ కమీషనరేట్ పరిధిలోని సిద్దిపేట మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన మడిగుడ్ల విజయ్‌కుమార్ (40)అనే వ్యక్తి ˊ పట్టుబడ్డారని తెలిపారు. ఇతన్ని విచారించగా దొంగతనాలను వృత్తిగా చేసుకు ని విందులు వినోదాలు జల్సాలు చేసుకుంటున్న వ్యక్తిగా నిర్ధారణ చేశామన్నారు. నాలుగు రోజుల క్రితం సుల్తానాబాద్ పట్టణంలోని పల్లవి బార్‌లో కూడా దొంగతనం చేశాడని, బార్ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు. విజయ్ కుమార్ మొదటి సారిగా సుల్తానాబాద్ ప్రాంతానికి వచ్చి రాజీవ్ రహదారి సమీపంలోని ఈ బార్‌ను ఎంచుకుని అతిగా మద్యం సేవించి బార్ గోడ దూకి దొంగతనానికి పాల్పడ్డాడని వివరించారు.

● **వివిధ జిల్లాల్లో ముప్పై కేసులు..**

మద్యానికి బానిసగా మారిన విజయ్‌కుమార్ మద్యం కోసం, జల్సాల కోసం చోరీలకు పాల్పడే వాడని ఇలా రంగారెడ్డి, సిద్దిపేట, జీడిమెట్ల, కొత్తగూడెం, రాయదుర్గం, వనస్థలిపురం, మహబూబాబాద్, సంగారెడ్డితో పాటు పలు జిల్లాలో ముప్పై కేసులు నమోదై ఉన్నాయని ఎస్ఐ శ్రావణ్ కుమార్ వివరించారు. నిందితుడిని అదివారం సుల్తానాబాద్‌లో అరెస్టు చేసి అతని వద్ద నుంచి పది వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చినట్టు తెలిపారు.

















కొనసాగుతున్న ఎత్తిపోతలు

రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 4: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి మిడ్ మానేరు జలశయానికి ఎత్తిపోతలు కొనసాగుతున్నా యి. ఆదివారం నాలుగు పంపుల ద్వారా 12,600 క్యూసెక్కుల నీరు వరద కాలువ ద్వారా మిడ్ మానేరు డ్యాంలోకి తరలి వె ళుతోంది. మిడ్ మానేరు ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 27.50 టీఎంసీలకు ప్రస్తుతం 15.507 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

● **ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో**

జగిత్యాల: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి 18,291 క్యూసెక్కుల నీరు వస్తోంది. ప్రస్తుతం డ్యామ్‌లో 44.266 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రాజన్న ఆలయంలో నేటినుంచి బ్రేక్ దర్శనం

వేములవాడ రూరల్, అగస్టు 4: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం నుంచి బ్రేక్ దర్శనం అమలు చేయనున్నట్లు ఆలయ ఈవో వినోద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 10-15 ని॥ల నుంచి 11-15 ని॥ల వరకు, సాయంత్రం 4-00 నుంచి 5-00 వరకు భక్తుల సౌకర్యార్థం బ్రేక్ దర్శనం ఉంటుందన్నారు. బ్రేక్ దర్శనం టికెట్ 300 రూపాయలుగా నిర్ణయించినట్లు తెలిపారు.

మత్స్యకారులకు చేపపిల్లలకు బదులు నగదు పంపిణీ చేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల అర్బన్, ఆగస్టు 4: మత్స్యకారులకు చేపపిల్లలకు బదులు నగదు పంపిణీ చేయాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని చెరువులు కుంటల విస్తీర్ణతను పరిగణలోకి తీసుకొని విత్తనాలకు సంబంధించిన చేప పిల్లలను రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. అయితే చేపపిల్లల పంపిణీకి గత నెలలో టెండర్‌లు పిలవగా, సంబంధిత చేపపిల్లల కాంట్రాక్టర్‌లు కుమ్మక్కయ్యారని ఎవరూ టెండర్‌లో పాల్గోనకుండా చేయడం వల్ల కార్యక్రమం వాయిదా పడిందన్నారు. కావున చేపపిల్లల పంపిణీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాక తరుపున ప్రత్యక్షంగా చేపపిల్లల పంపిణీకి బదులు వాటి విలువకు అనుగుణంగా చెరువు విస్తీర్ణతను పరిగణలోకి తీసుకొని మత్స్యపారిశ్రామిక సంఘాలకు నేరుగా నగదు రూపకంగా గ్రాంట్ మంజూరు చేయాలని కోరారు. ఈ చర్యల వల్ల దళారీవ్యవస్థ జోక్యం నిలువరింపజేయవచ్చన్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కాగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రాసిన లేఖపై జిల్లా గంగపుత్ర సంఘ పక్షాన గుమ్ముల అంజయ్య జీవన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.





అధ్వానంగా రహదారులు

- వర్షాలకు మరింత ప్రమాదకరంగా రోడ్లు
- ఇక్కట్లు పడుతున్న ప్రజలు
- పట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు



అధ్వానంగా రాంపూర్- రామన్నపేట మార్గం



ముత్యంపేట వరదకాలువ బ్రిడ్జిపై ప్రమాదకరంగా గుంతలు



గుంతలతో ముత్యంపేట నుంచి బ్లాక్ చౌరస్తాకు వెళ్లే మార్గం

మల్యాల, ఆగస్టు 4: మండల వ్యాప్తంగా గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. మరమ్మతులు లేకపోవడం, కొత్తగా పనులు చేపట్టకపోవడంతో ప్రయాణానికి ప్రజలు, ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురి అవుతున్నారు. ఈ రహదారులపై తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. లోతైన గుంతలు, దారి అంతా కాలువలను తలపించేలా నీటి నిలువలు ప్రమాదకరంగా మారుతున్నాయి. దీనికి తోడు ఇటీవల కురుస్తున్న వర్షాలకు అనేక గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయి. మండలంలోని దాదాపుగా అన్ని గ్రామాల్లో రహదారులు కోతలకు గురి కాగ కొన్ని చోట్ల వర్షపు నీటికి కొట్టుకుపోయాయి. తారు లేచి రాకపోకలకు ప్రమాదకరంగా మారాయి. రామన్నపేట- రాంపూర్- జగిత్యాల వెళ్లె రహదారికిరువైపుల కోతలకు గురి అయి లోతైన గోతులు ఏర్పడ్డాయి. అలాగే రాంపూర్ నుంచి రామన్నపేటకు వచ్చే మార్గం గుంతలమయమై బురద రోడ్డుగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అలాగే గొర్రెగుండం వెళ్లె మార్గంలో తారు లేచి, గోతులు ఏర్పడ్డాయి. ఇదే మార్గం నుంచి మండంలోని ఓగులాపూర్‌తో పాటు కొడిమ్యాల మండలానికి నిత్యం రాకపోకలు కొనసాగుతుంటాయి. రహదారి అధ్వన్నంగా మారడంతో ప్రయాణానికి పాట్లు పడాల్సి వస్తుంది. మండలంలో నగానికి పైగా గ్రామాల్లోని రహదారులు దెబ్బతినడంతో ప్రజలు, ప్రయాణీకులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు తగుచర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు

● **కాలువలను తలపిస్తున్న రహదారులు**

మండలంలోని వరదకాలువ ప్రాంత గ్రామాల పరిధిలో రహదారులు కాలువలను తలపిస్తున్నాయి. వరదకాలువతో ఒర్రెలు ఉనికి కోల్పోగా వాటి ద్వారా వచ్చే నీరు రహదారులపై ప్రవహిస్తున్నాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. వరదకాలువ వంతెనలపై మరమ్మత్తులు లేకపోవడంతో బ్రిడ్జిలకు ప్రమాదం పొంచి ఉంది. తగు చర్యలను తీసుకోవాలని వరదకాలువ ప్రాంత ప్రజలు, ప్రయాణీకులు అధికారులను కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు





వేములవాడ, సిరిసిల్లలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

వేములవాడ రూరల్, ఆగస్టు 4: ప్రజల సమస్యలను పరిష్కరించడానికి నిరంతరం పోరాటం చేస్తామని, గ్రామస్థాయిలో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడలో బీకేఎంయూ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని, ఎన్నికల వేళ డబ్బు ప్రభావం పెరిగినా ప్రజలు ఇప్పటికీ ఎర్ర జెండా వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ప్రజల సమస్యలపై పోరాటంలో కమ్యూనిస్టు పార్టీలు ముందుంటాయన్నారు. ప్రజల పక్షాన పోరాడడానికి పార్టీ చట్ట సభల్లో బలోపేతం కావాల్సిన అవసరముందన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడానికి ప్రణాళికలతో ముందుకెళ్తామన్నారు. మతంపేరుతో పబ్బం గడుపుకునే పార్టీలకు త్వరలోనే కాలం చెల్లుతుందన్నారు. పార్లమెంట్‌లో సీట్లు తగ్గినప్పటికీ బీజేపీ నాయకులకు అహం తగ్గడం లేదన్నారు. కార్మిక వ్యతిరేక, ప్రజావ్యతిరేక చట్టాలను తీసుకువస్తున్న కేంద్రప్రభుత్వ వైఖరిని ఎండగడుతామని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు టి వెంకటరాములు, బీకెఎంయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె. కాంతయ్య, ఎన్ బాలమల్లేశ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ కయ్యడ సృజన్‌కుమార్, తాటి వెంకటేశ్వర్లు, జంగయ్య, ఏసు, నాయకులు లింగారెడ్డి, మహాలక్ష్మి, కడారి రాములు పాల్గొన్నారు.

● **వస్త్ర పరిశ్రమలను కాపాడాలి..**

సిరిసిల్ల రూరల్: రాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యేలు, మంత్రులు అమ్మలు, అక్కలంటూ తిట్టుకునే దుస్థితి వచ్చిందని, ప్రజా సమస్యలపై మాట్లాడకుండా ఒకరిని ఒకరు తిట్టుకోవడంపై అధికార, ప్రతిపక్షాలు దృష్టి పెట్లాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వస్త్ర పరిశ్రమల అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఆదివారం సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో కార్మికులు ఆత్మహత్య చేసుకుంటుంటే ప్రభుత్వం సమస్యను పరిష్కరించడం లేదన్నారు. ఉపాధి కల్పించకుండా రాజకీయ కక్ష సాధింపునకు నేతన్నలను బలిచేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల ఫలితంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మొత్తం ప్రభుత్వంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం మారిన వెంటనే గత ప్రభుత్వం కొనసాగించిన పథకాలను బంద్ చేసి కార్మికులకు ఉపాధిని దెబ్బతీయం ఎంతవరకు సమంజమన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో వస్త్ర పరిశ్రమలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని తాను మాట్లాడానని, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరినా స్పందన లేకుండా పోయిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్డర్లకు సంబంధించిన బకాయిలను ఇవ్వలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యదర్శి పంతం రవి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ అసోషియేషన్ అధ్యక్షుడు అడెపు భాస్కర్, సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, అసాములసమన్వయ కమిటి అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, పోరండ్ల రమేష్, ఏనుగుల ఎల్లయ్య, అంకాలపు రవి, గాజుల నారాయణ, ఉడుత రవి, వెల్దండి శంకర్, గంగుల శ్రీనివాస్, వేముల దామోదర్, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, మండల బాలరాజు, బండారి అశోక్, దూడం రమేష్ గోవిందు రాజు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వీణవంక, ఆగస్టు 4: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలో విలేజ్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, రెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం టీఎస్02యూడీ4400 ఆటో ట్రాలీలో 24 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. అట్టీ బియ్యం ఎక్కడి నుంచి తీసుకొని వెళ్తన్నారని, రవాణా చేయుటకు అనుమతి పత్రాలు ఉన్నాయానని ప్రశ్నించారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో విచారించగా, తెలంగాణ ప్రభుత్వం పేదలకు అందించే బియ్యాన్ని ఒక కిలోకి రూ. 12ల చొప్పున కొనుగోలు చేసి చింతకుంట, కరీంనగర్ పరిసర ప్రాంతాల్లోని కోళ్ల పారాలకు రూ. 17లకు అమ్ముకుంటూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారన్నారు. ట్రాలీని, గంట వెంకటేష్, సిద్ధంకి భాస్కర్‌లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతి పేర్కొన్నారు.

ఆటో, బైక్ ఢీ: ఒకరికి గాయాలు

శంకరపట్నం, ఆగస్టు 4: శంకరపట్నం మండలం చింతలపల్లి శివారులో ఆటో బైక్ ఢీ కొని ఒకరు గాయపడ్డ సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మానకొండూర్ మండలం కొండపలకల గ్రామానికి చెందిన కొత్తిరెడ్డి గణపతిరెడ్డి చింతలపల్లి గ్రామానికి వెళ్లి వస్తుండగా, చింతలపల్లి మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొనడంతో గణపతిరెడ్డి తలకు, కాలుకు తీవ్రమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా, ప్రథమ చికిత్స అందిస్తూ కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హుజూరాబాద్, ఆగస్టు 4: ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నట్లు టౌన్ సీఐ తిరుమల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హుజూరాబాద్ మండలంలోని శాలపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లపై కేసు నమోదు చేశామన్నారు. అనంతరం టౌన్ సీఐ తిరుమల్ మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే వారిపైన చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాల మహానాడు సభను విజయవంతం చేయండి

కొడిమ్యాల, ఆగస్టు 4: ఢిల్లీలోని జంతర్‌మంత ర్‌లో ఈ నెల 7, 8, 9 తేదీల్లో నిర్వహించే మాల మహానాడు సభను విజయవంతం చేయాలని రాష్ట్ర మాల మహానాడు ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని అంగడి బజారులో ప్రజా గాయకుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మేడి అంజయ్య మాట్లాడుతూ మాలల సమస్యల పరిష్కారానికి నిర్వహించే సభకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు హలో మాల చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ చెన్నల సుమన్, మండల అధ్యక్షుడు కాయితరాజు, కన్వీనర్ రావుల నర్సింగరావు, నాయకులు బండి చందు, రాకేష్, శేఖర్, అర్జున్, యుగందర్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాల సంఘం నాయకులు

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు



లంబ రాములు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 4: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామంలోని వ్యక్తి లంబ రాములు అదృశ్యంపై కేసు నమోదు చేశామని స్టేషన్ హౌజ్ అధికారి కిషన్‌రావు ఆదివారం తెలిపారు. రాములు గ్రామ శివారులోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సమీపంలోని తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న పాడిగేదెకు గడ్డి వేసి వస్తానని ఈ నెల 3న ఇంటిలో కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడని పేర్కొన్నారు. తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదని చెప్పారు. రాములు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని స్టేషన్ హౌజ్ అధికారి కిషన్‌రావు వివరించారు.

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

బోయినపల్లి, ఆగస్టు 4: బోయినపల్లి మండలంలోని కొదురుపాక గ్రామానికి చెందిన కడుదుల కొమురయ్య(70) అనే వృద్ధుడు అనారోగ్యంతో ఇబ్బంది పడి ఇంటిముందు ఉన్న మామిడి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కేతమ్మ ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఇద్దరు కొడుకులు గతంలోనే చనిపోయారు. అనారోగ్య సమస్యల వలన ఆత్మహత్య చేసుకున్నట్లు కొమురయ్య భార్య కేతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై పృథ్వీధర్ గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



కటకం సత్యం(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఆగస్టు 4: నగరంలోని పద్మనగర్ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఆదివారం మధ్యాహ్నం విద్యుదాఘాతానికి గురై కటకం సత్యం (48) అనే వర్కర్ మృతి చెందాడని కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు తెలిపారు. పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం శాలపల్లికి చెందిన కటకం సత్యం రోజులాగే ఆదివారం 12:30 గంటల ప్రాంతంలో స్కూల్ మైదానంలోని రన్నింగ్ ట్రాక్‌ను జెట్ ప్రెషర్ పంప్‌తో శుభ్రం చేస్తుండగా ప్రమా దవశాత్తు విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. వెంటనే అక్కడే ఉన్న సూపర్‌వైజర్, కుక్‌లు గమనించి మోటార్ ప్లగ్ తొలగించారు. కిందపడిపోయిన సత్యంను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మరణించాడని ధ్రువీకరించారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలకు విశేష స్పందన



ఎంపిక పోటీలకు హాజరైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 4: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా అండర్16 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని క్రికెట్ అసోసియేషన్ కార్యాలయం నెట్స్‌లో నిర్వహించిన ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 142 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి నిర్వహకులు బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్, కీపింగ్ అంశాలలో ప్రతిభను పరీక్షించి, ప్రతిభ చాటిన 18మంది క్రీడాకారులను ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రికెట్ జట్టు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించినున్న అండర్-16 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొననుంది. ఈ పోటీల నిర్వహణలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్ మురళీధర్‌రావు పాల్గొని పర్యవేక్షించారు. జిల్లా సంఘ ఉపాధ్యక్షుడు కె మహేందర్‌గౌడ్, పి మనోహర్‌రావు, ఈసీ అజిత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ అమలు

- టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేష్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 4: పదేళ్లుగా ప్రమోషన్‌లు, బదిలీల కల సాకారం చేసి వందలాది కోర్టు కేసుల ద్వారా నమ్మకం కోల్పోయిన వేలాది మంది ఉపాధ్యాయులకు పదోన్నతుల కల సాకారం చేసిన ప్రభుత్వం, తమ సర్వీస్ రూల్స్‌ను సైతం తప్పక అమలు చేస్తుందనే విశ్వాసం తమకుందని టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేష్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక దేవిశ్రీ గార్డెన్‌లో టీఆర్టీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి మార్గాలను అన్వేషిస్తూ అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవచూపుతోందన్నారు. జీవో నంబర్ 11, 12ను సవరించి బీఈడీ పూర్తి చేసిన ఉపాధ్యా యులకు పీఎస్ హెచ్‌ఎంల పదోన్నతికి అర్హత కల్పించేందుకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిందని తెలిపారు. త్వరలోనే పీఎస్ హెచ్‌ఎంల పోస్టులు మంజూరు చేస్తూ వాటిలో ఎస్జీటీ ఉపాధ్యాయుల అందరికీ పదోన్నతి అవకాశం కల్పించబడుతుందని వివరించారు. ఆ విధంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. జీవో నంబర్ 317 ఉత్తర్వుల మేరకు నష్టపోయిన ఉపాధ్యాయులందరికీ స్థానిక జిల్లాలో బదిలీల కొరకు రాష్ట్ర సంఘ పక్షాన కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు తుంగూరి సురేష్, గుర్రం శ్రీనివాస్ గౌడ్, గోవర్ధన్, విజయానందరావు. చిన్నయ్య, సాయికృష్ణ, రణధీర్, అంబాజీ నాయక్, భీమయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కటుకం రమేష్

వైభవంగా రాజశ్యామల కుంకుమార్చన



కుంకుమార్చనలో మహిళలు

సిరిసిల్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలోని శ్రీరాజశ్యామల వారాహి సహిత, లలితేశ్వరి సుందరి, అష్టలక్ష్మీ సహిత లక్ష్మీనారాయణ దేవాలయాల 3వ వార్షికోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న కోటి 8 లక్షల కుంకుమార్చనలో భాగంగా ఆదివారం రాజశ్యామల కుంకుమ పూజ ఘనంగా నిర్వహించారు. 108 చీరలతో అమ్మవారిని అలంకరించారు. 600 మందికి పైగా మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ ఫౌండర్ గురుస్వామి రాచవిద్యాసాగర్, గురు స్వామి సురేష్, చేపూరి నాగరాజు, బుస్స శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో పాఠ్యాంశాలపై శిక్షణ తరగతులు

సిరిసిల్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి పొందిన వారికి సబ్జెక్ట్‌లో మెళకువలు నేర్పించడానికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆదివారం సిరిసిల్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో పదోన్నతి పొందిన వారికి గణితం, ఇంగ్లీష్, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం, సాంఘీకశాస్త్రంలో రిసోర్స్ పర్సన్‌ల ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాకాల మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులుగా ఉండాలని, అనుక్షణం సబ్జెక్ట్‌లో మెళకువలు నేర్చుకున్నప్పుడే బోధనలో నూతనత్వం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దేర్నాల బాపురెడ్డి, కార్యదర్శి దూమాల రాంచొరెడ్డి, మల్లారపు పురుషోత్తం, సత్తు రవీందర్, విక్కుర్తి అంజయ్య, కూడెల్లి రవీందర్, బండి ఉపేందర్, తిరుపతి, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అఖండ భజన

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 4: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్-రాచర్ల గొల్లపల్లి గ్రామంలోని అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో 'సే గానమే నా ప్రాణం' లో భాగంగా ఆదివారం నిర్వహించిన అఖండ భజన అలరించింది. ఉదయం గోపూజ, అఖండ దీపారాధన, అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమం చేశారు. అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు రాజుచేపాండే, రాష్ట్ర గౌరవ సలహాదారుడు రాజుగురుస్వామి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో అఖండ భజనను నిర్వహించారు. 12 గంటలపాటు నిర్విరామంగా అయ్యప్ప పాటలతో భక్తిపరవశ్యంలో భక్తులు మునిగిపోయారు. పడి పూజ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, బాస్కర్, చంద్రం, రాంరెడ్డి, సుధాకర్, శ్రీనివాస్‌యాదవ్, కిరణ్, రాజు, దేవరాజు, శ్రీనివాస్, ఆయా పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 4: సిరిసిల్ల పట్టణం మినీ స్టేడియంలో ఆదివారం డ్రాగన్ ఫస్ట్ మాటివాన్ కరాటే డో అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్టులు నిర్వహించారు. కటాస్, స్పారింగ్ విభాగంలో దొంతుల శ్రీనిఖ, సాహితి, మానస శ్రీనిధి, ముదారి సూర్యి, ఉదంతికి ప్రతిభ కనబరిచారు. అకాడమి ఇన్‌చార్జి, మాస్టర్ మామిడాల సమ్మయ్య, డైరెక్టర్, కరాటే మాస్టర్ కుమ్మరి మల్లేశం అభినందించారు. టీటీడీపీ జిల్లా అధ్యక్షుడు దొంతుల శ్రీహరి, కరాటే మాస్టర్ నాగుల కనకయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తంగళ్లపల్లి, ఆగస్టు 4: తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నక్క రవి ఆధ్వర్యంలో ఆదివారం 17 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ గజవ శివప్రసాద్, సిరిసిల్ల ప్యాక్స్ వైస్ చైర్మన్ బండి దేవదాస్, మాజీ ఎంపీటీసీ బుస్స స్వప్నలింగం, బీఆర్ఎస్ నాయకులు బుస్స లింగం,రాగిపెల్లి కిష్టారెడ్డి, మాజీ వార్డు సభ్యులు పసుల శేఖర్, పెద్ది రమ, కాంగ్రెస్ నాయకుడు వర్యాల దుర్గారెడ్డి ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఇల్లంతకుంట, ఆగస్టు 4: మండలంలోని పలు గ్రామాలలో బాధిత కుటుంబాలకు బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతిరెడ్డి ఆదివారం పరామర్శించారు. పెద్దిపూర్ గ్రామానికి చెందిన సోమవేని పర్శరాం, కేసన్నపల్లె గ్రామానికి చెందిన నర్సింగరావు, ముస్కానిపేట గ్రామానికి చెందిన నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందారు.కార్యక్రమంలో శ్రీనివాస్, లక్కారెడ్డి, రమణారెడ్డి, కరుణాకర్, అంజి, అఖిల్, శేఖర్, రాజు, రమేష్, అఖిల్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

భగవన్‌గర్, ఆగస్టు 4: కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులు సాగు చేసే భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. కేంద్ర పాలకులు బడ్జెట్‌లో వ్యవసాయ అభివృద్ధికి పెట్టుబడులు పెడతామని చెప్పడం సిగ్గుచేటన్నారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఢిల్లీలో రైతుల దీక్షకు మోదీ ప్రభుత్వం దిగివచ్చి నల్ల చట్టాలను వెనక్కి తీసుకుందన్నారు. రుణమాఫీ కాని రైతులు ఏపీఎంలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 6, 7 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ శిబిరాలు హైదరాబాద్‌లో జరుగుతున్నాయన్నారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంజర భూమయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు పొనగంటి కేదారి, రైతు సంఘం నాయకులు కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, కంది రవీందర్‌రెడ్డి, పైడిపల్లి రాజు, కాంతాల తిరుపతిరెడ్డి, గడ్డం రాంరెడ్డి, ముత్యాల,శ్రీనివాస్‌రెడ్డి, బండెల శ్రీనివాస్, రవి, మధూకర్, బుచ్చయ్య, తిరుపతి, లక్ష్మారెడ్డి, బాపురెడ్డి పాల్గొన్నారు.

రాళ్లవాగు ప్రాజెక్టుకు జలకళ

● ఆయకట్టుదారుల్లో ఆనందం



మత్తడి దూకుతున్న రాళ్లవాగు

కథలాపూర్, ఆగస్టు 4 : వర్షాకాలం ఆరంభమై రెండు మాసాలు గడుస్తున్నా రాళ్లవాగు ప్రాజెక్టు ఎప్పుడు నిండుతుందోనని రైతాంగం ఎదురు చూస్తుండగా ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. నిజామాబాద్ జిల్లా కమ్మరిపల్లి మండలం కోనాపూర్ అడవుల్లో ఐదోవారం కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టు నిండు కుండలా మారింది. పూర్తిగా నిండిపోవడంతో మత్తడి పొంగి పొర్లుతోంది. ఈ ప్రాజెక్టు నిండితే భూషణరావుపేట, కథలాపూర్, ఊటపల్లి, కోనాపూర్ గ్రా మాలకు తాగు, సాగు నీటి సమస్య లేకుండా ఉంటుంది. ప్రాజెక్టు నిండడంతో ఆయకట్టుదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఆచార వ్యవహారాలను తరాలకు నేర్పించాలి

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 4: ప్రస్తుతం సమాజంలో ఆచార వ్యవహారాలు తగ్గిపోయాయని, తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బ్రాహ్మణ సేవా సమితి వారు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని జగ్గాసాగర్ గ్రామ శివారులోని పురాతనమైన కొండ స్వామి ఆలయంలో బ్రాహ్మణ సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆషాఢ మాసం ఆమావాస్య సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ బ్రాహ్మణ జన్మ మహా స్వతమైనది, తమ పిల్లలకు తల్లిదండ్రులు ఆచార వ్యవహారాలు నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు.

ఫలించిన చర్చలు.. నేతన్నల దీక్షల విరమణ

- వస్త్ర పరిశ్రమ సమస్యల పరిష్కారానికి కృషి
- ప్రభుత్వం సానుకూలం - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం నేపథ్యంలో సిరిసిల్ల పవర్‌లూం వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తమ డిమాండ్ల సాధన కోసం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద నేత కార్మికులు, ఆసాములు, యాజమానులు దీక్షలు కొనసాగిస్తున్నారే వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లో నేతన్నల సమస్యలపై ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావుతోపాటు ఐక్యవేదిక ప్రతినిధులు చర్చలు జరిపారు. చర్చలు సఫలం కావడంతో అంబేద్కర్ చౌరస్తా వద్ద అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ దీక్షలో కూర్చున్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

వస్త్ర పరిశ్రమ సమస్యల పరిష్కారానికి కృషి

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, చేనేత జౌళి శాఖ, సెస్ చైర్మన్, అధికారులు, పవర్‌లూం యజమానులు, ఆసాములతో చర్చలు జరిపారు. విద్యుత్ సబ్సిడీ, కోర్సులో ఉన్న కేసులు, ఎస్ఎస్ఐ యూనిట్ల అంశాలపై చర్చించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఆ దిశగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే బతుకమ్మ బకాయిలు పలు మార్లు విడుదల చేసినట్లు చెప్పారు. స్కూల్ యూనిఫాం క్లాత్ ఆర్డర్లు అందజేశామన్నారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాలు మినహా అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా కల్పించారు. ముఖ్యమంత్రి, మంత్రులతో చర్చించామని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో పవర్‌లూంలకు అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహాలపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పవర్‌లూం పరిశ్రమలో విద్యుత్ సబ్సిడీ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, చేనేత జౌళి శాఖ ఏడీ సాగర్, ఐక్యవేదిక ప్రతినిధులు తాటిపాముల దామోదర్, ఆడెపు భాస్కర్, అంకారపు రవి, గోవిందు రవి, మండల సత్యం, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఐక్య వేదిక ప్రతినిధులు



దీక్షలను విరమింపజేస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

ప్రభుత్వ విప్‌తోనే వేములవాడ అభివృద్ధి సాధ్యం



రాజన్నకు కోడెమొక్కులు చెల్లిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడ రూరల్, ఆగస్టు 4: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సారథ్యంలోనే వేములవాడ అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం బడ్జెట్‌లో 50 కోట్లు కేటాయించిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరఫున రాజన్నకు ఆదివారం 50 కోడెలు కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో వెనక్కి వెళ్లిపోయిన 20 కోట్ల నిధులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన వీటీడీఏ సమావేశం ఏర్పాటు చేసి తిరిగి తెప్పించిన ఘనత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌దేనన్నారు. గతంలో కేసీఆర్ రాజన్న ఆలయ ఆవరణలో మాట్లాడుతూ ఏటా 100 కోట్లు కేటాయిస్తానని రాజన్ననే మోసం చేసారన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు కేవలం ఉనికి కోసమే ఆందోళన చేస్తున్నాయన్నారు. రాయన్న రోజుల్లో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సారథ్యంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో వేములవాడను అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకట స్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కౌన్సిలర్లు ఇప్పపూల అజయ్, నాయకులు కూరగాయల కొమురయ్య, చిలుక రమేష్, పాత సత్యలక్ష్మి, కనికరపు రాకేష్, తూం మధు, నామాల లక్ష్మరాజం, ముప్పిడి శ్రీనివాస్, తోట రాజు, చిలివేరి శ్రీనివాస్, అన్నారం శ్రీనివాస్, పులుం రాజు, నాగుల విష్ణు, కొమ్ముల బాలకృష్ణ, సూగూరి లక్ష్మి కృష్ణ, దాడి మల్లేశం, నేరెళ్ల శ్రీధర్, చంద్ర శేఖర్, దళిత కుమార్ ,మతాడి రాజేశం, పోతుగంటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

వేములవాడ రూరల్, ఆగస్టు 4: తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని రాజన్న ఆలయంలో పనిచేస్తున్న పారిశుధ్యకార్మికులు సీపీఐ రాష్ట్ర కారదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతి పత్రం అందజేశారు. తమకు దేవాదాయ శాఖనుండి నేరుగా జీతాలు అందేలా చూడాలని, తమకు కనీస వేతనం 25వేలు ఇవ్వాలని, ఐడీ కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ అందించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, అడ్డూరి కేతవ, తాలపల్లి లక్ష్మి, దుర్గయ్య కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌నకు వినతి

వేములవాడ రూరల్, ఆగస్టు 4: వస్త్ర పరిశ్రమ సమస్యను పరిష్కరించాలని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను సిరిసిల్ల పవర్ రూమ్ యజమానులు ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. వేములవాడ పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రిలో వారిని కలిసి తమ సమస్యను వినిపించుకునితగిన చర్యలు తీసుకోవాలని సిరిసిల్ల పవర్ లూమ్ యజమానులు, ఆసాములు కోరారు. వారి వెంట హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ శాఖ ఏడీ సాగర్ తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయిలో జిల్లా కోచ్‌ల ప్రతిభ

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 4: తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ మియాపూర్, థైక మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో జాతీయ కిక్ బాక్సింగ్ రిఫరీ టెక్నికల్ సెమినార్‌లో జిల్లాకు చెందిన కోచ్‌లు ప్రతిభ కనబరిచారు. కోచ్‌లు వద్నాల శ్రీనివాస్, ఎలగందుల శ్రీనివాస్, గగ్గూరి దివ్య పిట్టల లతను ఇండియ కిక్ బాక్సింగ్ ఫెడరేషన్ రిఫ్రి సీమస్టన్ ప్రశంస పత్రాలతో అభినందించారు. తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహిపాల్ పాల్గొన్నారు.

క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయి

చందుర్తి,ఆగస్టు 4:క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ అన్నారు. చందుర్తి మండలం మూడపల్లి క్రీడా మైదానంలో ప్రీమియర్ లీగ్ సీజన్ ఫస్ట్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా మొదటి బహుమతి హరీష్ లెవెల్‌కు రూపాయలు 20 వేల నగదుతోపాటు షీల్డ్‌ను, రెండవ బహుమతి చిరు లెవన్‌కు 10 వేల నగదుతోపాటు షీల్డును బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు ఈర్లపల్లి రాజుతో కలిసి మాజీజడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ముస్తాబాద్, ఆగస్టు 4: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై గణేష్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆటో డ్రైవర్లకు ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ పాటించాలన్నారు. నంబరు ప్లేట్లు నిబంధనల ప్రకారం వేయించుకోవాలన్నారు. పరిమితికి మించి ప్యాసింజర్లను ఎక్కించుకోవద్దని, ఆటోలను ప్రమాదకరంగా నడపొద్దని సూచించారు. ఆధారపడే కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తగా డ్రైవ్ చేయాలన్నారు. లైసెన్సులు లేకుండా నడపొద్దన్నారు. నూతనంగా వస్తున్న చట్టాలపై ఎప్పటికప్పుడు అవగాహన తెచ్చుకోవాలన్నారు. డ్రైవర్లు మద్యం తాగి నడిపితే పరిస్థితి సీరియస్‌గా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎస్ ప్రభుమయ్య, వీసీలు శేఖర్, దామోదర్ ఆటో డ్రైవర్లు శంకర్, రాములు, స్వామి, శ్రీనివాస్, రవి, రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

కోనరావుపేట ఆగస్టు 4: కోనరావుపేట మండలం మరిమడ్ల ప్రభుత్వ పాఠశాలలో అత్యధిక జీపీఏలు సాధించిన విద్యార్థులను మూల వాగు మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. మరిమడ్ల ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతిలో జీపీఏలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహంతో పాటు బహుమతులు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాస్, గ్రామస్తులు జంక శ్రీనివాస్, మాట్ల అశోక్, జంక సదానందం, రాజా మల్లేశం, పుల్లం మల్లేశం, కమ్మరి దిలీప్, మూల వాగు మిత్రమండలి సభ్యులు మోతె దేవ రెడ్డి, వికృతి హనుమన్న, గుండెల్లి రవీందర్, నాయిని భాస్కర్, బిక్షపతి, కనకయ్య, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్రాల బీసీ లెక్కతోనే వాటాలో హక్కులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 4: కేంద్ర, రాష్ట్రాల్లో బీసీ లెక్కలతోనే వాటాకు హక్కులు ఏర్పడుతాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి వర్ధన్నంద్ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జిల్లా సమావేశంలో చలో అమృత్‌సర్(పంజాబ్) అఖిల భారత జాతీయ ఓబీసీ 9వ మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వర్ధన్నంద్ మాట్లాడుతూ రాష్ట్రంలో పలుగుణ చేయకుండనే ఓటర్ లిస్ట్ ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలిసిందన్నారు. అలా జరిగితే బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. గత ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం బీసీ కులగణన చేసి 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. దేశంలో బీసీలకు లెక్కలు లేక పోవడం శోచనీయమన్నారు. చట్టసభలో బీసీలకు రిజర్వేషన్లు లేకపోవడంతో పార్లమెంట్‌లోని 543 ఎంపీ స్థానాలకు 270 మంది బీసీలు పార్లమెంట్‌లో అడుగుపెట్టాలని కానీ కేవలం 82 మంది మాత్రమే ఉన్నారన్నారు. అదే విధంగా తెలంగాణ అసెంబ్లీలో 119 మంది ఎమ్మెల్యేలకు 60 మంది బీసీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ఉండాలని కాని కేవలం 18 మంది మాత్రమే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గల్లీ నుండి ఢిల్లీ వరకు బీసీ వాణి వినిపించేందుకు ఈ నెల 7న అఖిల భారత జాతీయ ఓబీసీ 9వ మహాసభను పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణలోని బీసీలు అఖిల భారత జాతీయ ఓబీసీ 9వ మహాసభకు పెద్ద సంఖ్యలో పాల్గొని బీసీల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరబోయిన మల్లేశంయాదవ్, పట్టణ అధ్యక్షుడు తడక కమలాకర్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కంచర్ల రవిగౌడ్, జిల్లా బీసీ సంఘం నాయకులు కందుకూరి రామాగౌడ్, బత్తుల ప్రసాద్, బోయిన శ్రీనివాస్, కొండ విజయ్, తిరుపతి, శ్రీనివాస్, రాజు, శ్రీధర్ పాల్గొన్నారు.



సిరిసిల్లలో కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు



క్షీరాభిషేకం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

గంభీరావుపేట, ఆగస్టు 4 : గంభీరావుపేటలో ఎంఆర్‌పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సంబరాలు నిర్వహించారు. సుప్రీం కోర్టు వర్గీకరణపై ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పోరాట ఫలితంగానే ఈ రోజు మాదిగలకు న్యాయం జరిగిందని మండల బీజేపీ అధ్యక్షుడు గంట అశోక్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ రోజు వర్గీకరణపై ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం వల్లే ఈ రోజు మాదిగలకు, మాదిగ ఉపకులాలకు సంపూర్ణ న్యాయం జరిగిందన్నారు. అనంతరం ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు బద్దుకుం తిరుపతి, జెరిగ బాను, బాలకిషన్, వెంకటేష్, ఎర్రోల్ల శంకర్, నరేష్, మహేష్, శ్రీహరి, పర్శరాం, ప్రేమ్, సందీప్ జిల్లా నాయకులు, లక్ష్మణ్, చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

ముస్తాబాద్: మండలంలో ఆదివారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం భవనంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. 30 ఏళ్లుగా వర్గీకరణ కోసం శ్రమిస్తే ప్రస్తుతానికి సాధ్యమైందన్నారు. వర్గీకరణ కోసం కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు కొమ్ము బాలయ్య, బట్టు రాజయ్య, మండెపల్లి రాములు, గడ్డల దేవయ్య, సడిమెల బాలయ్య, బుర శంకర్, సడిమెల అశోక్, కొమ్ము కృష్ణ, రణధీసూర్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలం మల్కపేటలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై సంతోషం వ్యక్తం చేస్తూ విజయోత్సవాలను నిర్వహించారు. 30 సంవత్సరాల పోరాటానికి న్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ నాయకులు కస్తూరి రమేష్, ఎలగందుల బిక్షపతి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ లత మహేందర్, నాయకులు పాల్గొన్నారు.

మంగళపల్లి రోడ్డు మరమ్మతు



మొరంపోసి బాగు చేస్తున్న మంగళపల్లి రహదారి

కోనరావుపేట, ఆగస్టు 4 : మంగళపల్లి ప్రధాన రహదారి అడుగడుగున గుంతల మయంగా మారడంతో అధ్వాన్నంగా మారిన మంగళపల్లి రహదారిని శ్రమదానంతో ఆదివారం బాగు చేసుకున్నారు. మంగళపల్లి మాజీ ఉపసర్పంచ్ అపురం శరత్ ఆధ్వర్యంలో సుమారు లక్ష రూపాయల ఖర్చుతో టిప్పర్ల ద్వారా మొరంపోసి బాగు చేశారు. అధ్వాన్నంగా మారిన రహదారిని బాగు చేయడంతో పలువురు గ్రామస్తులు శరత్‌ను అభినందించారు.

డీఈవోపై ప్రభుత్వ విప్ అడ్లూరికి ఫిర్యాదు

ధర్మపురి, ఆగస్టు 4: పదిహేను ఏళ్లుగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డిని తొలగించాలని ఎస్సీ ఎస్టీ జిల్లా అధ్యక్షుడు మచ్చ శంకర్, ప్రధాన కార్యదర్శి బైరం హరికిరణ్ కోరారు. ఈ మేరకు ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఆదివారం కలిసి ఫిర్యాదు చేశారు. డీఈవో నిరంకుశ వైఖరివల్ల జిల్లాలోని ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, వెంటనే ఆయనను మాతృ సంస్థ వైట్ కలెక్టరేట్‌కు బదిలీ చేయాలని సిపారసు చేయాలని వారు కోరారు. ఇటీవల బదిలీల్లో స్పౌజ్ కేటగిరిలో కొంతమంది ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా ఎలా అక్రమాలకు పాల్పడ్డారని వారిపై నేటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఫిర్యాదు చేశారు. పదోన్నతుల్లో డీఎస్సీ 96 చెందిన కొంతమంది ఎస్జీటీ ఉపాధ్యాయులను కాదని కేవలం ఇద్దరికిపదోన్నతులు కల్పించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



వేడుకల్లో సీనియర్ సిటిజన్స్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 4: సిరిసిల్ల పట్టణం గీతానగర్‌లో ఆదివారం సీనియర్ సిటిజన్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జనపాల శంకరయ్య మాట్లాడుతూ ఆత్మీయతలను పంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ వేడుకల్లో నారాయణ నందగిరి స్వామి, అసోసియేషన్ జిల్లా కోశాధికారి దొంత దేవదాస్, సహాధ్యాయులు కోడం నారాయణ, మహిళా ఉపాధ్యక్షురాలు మాటేటి ఇందిరాదేవి, లయన్స్ క్లబ్ కట్టెకోల లక్ష్మీనారాయణ,రామచంద్రం, సహాయ కార్యదర్శులు బుక్కయ్య భాస్కర్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు ఎడమల శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రంగు అంజయ్య, ప్రధానకార్యదర్శి సామల గణేష్, సంయుక్త కార్యదర్శి ముక్క శ్రీనివాస్, కోశాధికారి జుకంటి శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: స్నేహితుల దినోత్సవ వేడుకలను మండల కేంద్రంలో యువకులు ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ ప్రాంతంలో స్నేహితులు కలిసి కేక్‌కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యువజన కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్ యువతను అభినందించారు.

ప్రమాదకరంగా చెట్టు



ప్రమాదకరంగా ఉన్న చెట్టు

చందుర్తి ఆగస్టు 4: చందుర్తి మండలం కట్టలింగంపేట గ్రామంలో ఓ వృక్షం ప్రమాదకరంగా మారింది. గ్రామంలోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిలో పక్కన గల ఒడ్డెలో గురువాడం చెందిన నంది వచ్చే వరద నీటితో ఓ భారీ వృక్షం వేళ్ళ పైకి తేలాయి. వృక్షం రోడ్డు వైపు వంగి ఉంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రమాదం జరగకముందే తొలగించాలని వాహనదారులు కోరారు.